
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024

నయనానందం పద్మనాభుని కల్యాణం

అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవం గురువారం రాత్రి పద్మనాభంలో వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలకు హనుమంతుని వాహనంపై తిరువీధి జరిపిన అర్చకులు రాజవీధిలో సంప్రదాయబద్ధంగా ఎదురుసన్నాహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామిని ఉభయ దేవేరులతో సహా ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని పూర్తిచేశారు. పెద్దసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి, పులకించారు.

- వివరాలు 6లో



పద్మనాభంలో అనంతపద్మనాభుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నగరంలో కొకైన్ కలకలం

పోర్టులో భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్న సీబీఐ



- బ్రెజిల్ నుంచి నౌకలో నగరానికి దిగుమతి
- 25 వేల కిలోల డ్రై ఎస్ట్‌లో కలిపి రవాణా
- ఇక్కడి నుంచి రహస్యంగా ఇతర ప్రాంతాలకు...
- విశాఖలోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ పేరిట రాక
- విచారణకు అడ్డంపడిన ఏపీ అధికారులు

విశాఖ పోర్టులో భారీగా కొకైన్ పట్టుబడిందన్న వార్త నగరంలో కలకలం రేపింది. బ్రెజిల్ నుంచి వచ్చిన కంటైనర్‌లో వేల కిలోల కొకైన్ ఉన్నట్టు గుర్తించి సీబీఐ అధికారులు రెండు రోజుల క్రితం స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను నగరానికి రప్పించి, ఇక్కడి నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుంటే నగరంలో భారీఎత్తున డ్రగ్స్ లభించాయనే సమాచారం విద్యార్థులు, యువతీయువకుల తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తించింది. - మెయిన్‌లో



కంటైనర్ టెర్మినల్

జగనన్న...పార్లే ప్రాజెక్టు ఎక్కడున్నా??

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుస్తామంటూ రెండేళ్ల కిందట ఆర్భాటం

- వ్యర్థాల పునర్వినియోగానికి ప్రతిపాదన
- 2022 ఆగస్టులో 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం
- ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారైన ముడిసరకుతో రూపొందించిన కళ్లజోడు ధరించి మురిసిపోయిన సీఎం జగన్
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అంటూ ప్రకటన
- ఏడాదిన్నరైనా కానరాని పురోగతి



వ్యర్థాలతో తయారైన షూను చూపుతున్న ముఖ్యమంత్రి (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడంతో పాటు...సేకరించిన వ్యర్థాలతో దుస్తులు, కళ్లద్దాలు, బూట్లు వంటి వాటిని తయారుచేసేందుకు అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 27న ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆ సంస్థ తయారుచేసిన వస్తువులను పట్టుకుని హడావుడి చేశారు. అయితే ఏడాదిన్నర గడిచిపోయినా ఆ ప్రాజెక్టు మాత్రం పట్టాలెక్కలేదు.



పార్లే సంస్థతో ఒప్పందం సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారైన కళ్లజోడు ధరించిన సీఎం (ఫైల్ ఫొటో)

ప్రస్తుతం ఎక్కడచూసినా ప్లాస్టిక్ వస్తువులే కనిపిస్తున్నాయి. ప్రజలు ప్లాస్టిక్‌ను వాడేసిన తర్వాత కాలువలు, గెడ్డల్లో పడేస్తున్నారు. అవి నేరుగా సముద్రంలోకి చేరుకుంటున్నాయి. తీరంతోపాటు జలాలు కూడా కలుషితం అయిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరడం వల్ల 267 రకాల జీవజాతుల మనుగడ దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడంతో పాటు వాటి రీసైక్లింగ్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనికోసం ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక రకాల ఉత్పత్తులను తయారుచేసే అమెరికాకు చెందిన ఎన్‌జీవో 'పార్లే ఫర్ ది ఓషన్స్', గ్లోబల్ అలయెన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ వర్క్స్ (జీఏఎస్‌పీ) అనే రెండు సంస్థలను సంప్రతించింది. ఆ సంస్థలు కూడా ముందుకు రావడంతో 2022 ఆగస్టు 27న ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి జీవీఎంసీ భారీగా డబ్బులు ఖర్చు చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి...సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన కళ్లజోడును పెట్టుకుని మురిసిపోయారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన షూను చూపిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. పార్లే సంస్థ విశాఖలోనే రూ.16 వేల కోట్ల పెట్టుబడితో యాన్ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తుందని, దీనివల్ల 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ... మిగతా 6వ పేజీలో



సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ ప్రతినిధి (ఫైల్ ఫొటో)

పార్టీలకు అనుకూలంగా వ్యవహరించొద్దు

- నేతలకు సన్నిహితంగా మెలగవద్దు
- ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు
- పోలీసులకు సీపీ రవిశంకర్ అయ్యన్నార్ హెచ్చరిక
- ఇంటింటి ప్రచారానికి పోలీసుల అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖలోని అధికారులు, సిబ్బంది ఎవరైనా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా, నాయకులతో సన్నిహితంగా మెలిగినా కఠిన చర్యలు తప్పవని సీపీ రవిశంకర్ అయ్యన్నార్ హెచ్చరించారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పోలీసులు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించాలనుకున్నాసరే కచ్చితంగా పోలీసుల అనుమతి పొందాల్సిందేనని స్పష్టంచేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ ఉద్యోగులతో కూడిన 63 ప్రత్యేక ... మిగతా 6వ పేజీలో

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

- రాత్రి ఏడున్నర గంటల సమయంలో గేటు దూకి ఇంట్లోకి చొరబడిన దుండగుడు
- ఆయన భార్య మెడపై కత్తిపెట్టి బెదిరింపు
- మెడలోని బంగారం, బీరువాలోని నగదు, బంగారం తీసుకుని ఉడాయింపు



డాబాగార్డెన్స్‌లోని మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి దోపిడీ జరిగింది. తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లగా, ఇంట్లో ఆయన భార్య ఒక్కరే ఉన్నారు. ఆమెను దుండగుడు కత్తితో బెదిరించి భారీగా డబ్బు, నగలు అపహరించుకుపోయాడు. దీనికి సంబంధించి టూటౌన్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.


నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల లలితా కాలనీలో తైనాల విజయ్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడడంతో భార్యాభర్తలు ఇద్దరే ఉంటున్నారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న తైనాల విజయ్‌కుమార్ అక్కడ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి పర్యటన ఉండడంతో ఆయన అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో తైనాల భార్య ఒక్కరే ఇంట్లో ఉన్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖానికి మాస్క్‌తోపాటు నెత్తిన టోపీ పెట్టుకుని ఒక వ్యక్తి ఇంటి ప్రహరీ దూకి లోనికి చొరబడ్డాడు. నేరుగా కిచెన్‌లోకి వెళ్లి అక్కడ వంట పనిలో నిమగ్నమై ఉన్న తైనాల భార్య మెడపై కత్తి పెట్టి చంపేస్తానని బెదిరించాడు. ఆమె మెడలోని బంగారం తాడు, గొలుసుని తీసుకున్నాడు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఇచ్చేయాలని లేనిపక్షంలో చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆమె బీరువాలో ఉన్న నగదు, బంగారాన్ని చూపించడంతో వాటిని తీసుకుని దుండగుడు ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.12
సహరి (శని)	4.44

ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు ఇచ్చేది లేదని, రెగ్యులర్ ఉద్యోగులు, సిబ్బంది వివరాలను శాఖల వారీగా నివేదించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. అత్యవసర సేవల్లో ఉండేవారు తప్ప మిగిలిన వారంతా ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిందేనని పేర్కొన్నారు. పోల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది కేటాయింపు, ఇతర అంశాలపై చర్చించేందుకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సత్యసాయినగర్, సింగాలమ్మపురం, బీఎస్ లేఅవుట్, వినాయక ఆలయం, గ్రీన్‌పార్కు ఏరియాల్లో సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

సమన్వయంతో కూటమి విజయానికి కృషిచేయాలి

▸ తెలుగుదేశం పార్టీ నాయకుడు శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 21: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేయాలంటే కార్యకర్తల మధ్య సమన్వయం అవసరమని టీడీపీ నాయకుడు ఎం.శ్రీభరత్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఉత్తర నియోజవర్గంలోని పార్టీ వార్డు అధ్యక్షులు, బూత్ నాయకులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పొత్తులో భాగంగా మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం అవసరమని, ఇంటింటికీ వెళ్లి వాటిని వివరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నేతలు బి.బాలకృష్ణ, ఎం.కిశోర్, వెంకట రమణారావు, అక్కిరెడ్డి జగదీష్, ఇ. రమణ తదితరులు పాల్గొన్నారు.


ధర్మానగర్‌లో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్ రాజు


'ఉత్తర' నేతలతో మాట్లాడుతున్న శ్రీభరత్

కూటమితోనే సుస్థిర పాలన

కంచరపాలెం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. జీవీఎంసీ 55వ వార్డులోని ధర్మానగర్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, అన్ని రకాలుగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఆయన వెంటన విజయలక్ష్మి, పార్వతి ఇతర నాయకులు పాల్గొన్నారు.

నగరంలో సెబ్ విస్తృత తనిఖీలు

సీతమ్మధార, మార్చి 21: ఎన్నికల నేపథ్యంలో రామాటాకీస్ జంక్షన్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం తరలింపు జరుగుతోందనే అనుమానంతో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజులు నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు వి.వేణుగోపాల్, ఎస్.ముసలనాయుడు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

'కేఏ పాల్ విజయాన్ని ఆపలేరు'

అక్కయ్యపాలెం, మార్చి 21: విశాఖ లోక్‌సభ సభ్యునిగా పోటీ చేయనున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్ అన్నారు. రైల్వేన్యూ కాలనీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి, నగరానికి విశేష గుర్తింపు రావాలంటే కేఏ పాల్‌తోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో బాబూజీరావు, రాజు, భవానీ, స్వాతి, సతీశ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జగదాంబ కూడలి, మార్చి 21: వన్‌టౌన్ కంచరవీధి ఎంబరుమన్నార్ దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం గురుడవాహనంపై నిర్వహించిన శ్రీవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా సాగింది. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా విశేషహోమం, ప్రత్యేక అర్చన, బలిహరణ, విశేషపూజలను నిర్వహించారు. వేంకటేశ్వరునికి సదస్యం, స్థాళిపాకోత్సవం, సప్తమహర్షి ఆరాధన వంటి సేవలను నిర్వహించారు. ఈనెల 29 వరకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని ఈవో ఎం.నీలిమ తెలిపారు.

కోడూరుకు శోభన్‌బాబు స్మారక పురస్కారం


కనకరాజుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార, మార్చి 21 : నట భూషణ్ శోభన్‌బాబు 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌరగ్రంథాలయంలో శోభన్‌బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు హాజరై కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. విజయ నిర్మాణ్ సంస్థ చైర్మన్ ఎస్.విజయ్‌కుమార్, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్, సంస్థ గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో తారాస్థాయికి చేరుకున్న విభేదాలు

▸ ఏడుగురిపై కేసు నమోదు ▸ 15 రోజుల రిమాండ్

పూర్ణామార్కెట్, మార్చి 21: దక్షిణ నియోజకవర్గంలోని జనసేన పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుపై కార్పొరేటర్ సాధిక్, వంశీ వర్గీయుల మధ్య రెండు రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో ఒకరిపై ఒకరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గరికిన రవి, శ్రావణ్, త్రినాథ్, రఘు, నీలంరాజు, వాసుపల్లి నరేష్, చిన్నాలపై నమోదు చేసి, కోర్టులో హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించిందని వన్‌టౌన్ సీఐ కె.భాస్కర్ తెలిపారు.

'ఎన్నికల నేపథ్యంలో డీఎస్సీని వాయిదా వేయాలి'

మహారాణిపేట, మార్చి 21: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు, పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సందర్భంగా డీఎస్సీ వాయిదా వేయాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం మహారాణిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోని డీఎస్సీని ఇప్పుడు హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధమయిందన్నారు. సుమారు పది లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం, పదోతరగతి స్పాట్ వాల్యూషన్ ప్రక్రియ నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

డాబాగార్డెన్స్, మార్చి 21: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అడవుల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ మంజుల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మహిళా కళాశాల అధ్యాపకులు

అంగరంగ వైభవంగా అనంత పద్మనాభుని కల్యాణం


స్వామివారి తిరువీధి, ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పద్మనాభం, మార్చి 21: అనంత పద్మనాభుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి భక్త జన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు పండితుల వేదమంత్రోచ్చారణలతో పద్మనాభం పులకించింది. భక్తుల కోలాహలం మధ్య వైకుంఠ వాసుని కల్యాణం కమనీయంగా సాగింది. ఉత్సవానికి ముందు కుంతీమాధవస్వామి ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్ని ప్రతిష్ఠాపన, విశేషహోమాలు, గ్రామ బలిహరణ నిర్వహించారు. భేరి పూజ తరువాత గరుడ ధ్వజాన్ని ఆరోహణ చేశారు. హనుమంతుని వాహనంపైన అనంతుని ఉత్సవ విగ్రహాన్ని, పల్లకిపై శ్రీదేవి, భూదేవి సహిత స్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రాజవీధిలోని పాత ఆంధ్రాబ్యాంకు సమీపంలో ఎదురు సన్నాహోత్సవాలలో భాగంగా పెళ్లి చూపులను, వరునికి, వధువును అడిగే విధానాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుని ఉత్సవ విగ్రహాలను ఆలయంలోకి తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో ఉంచారు. దంపతులతో సంకల్పం చెప్పించిన అనంతరం ఈఓ నానాజీబాబు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పుణ్యాహవచనం, రక్షాబంధనం చేసి స్వామివారికి పాదప్రక్షాళన చేశారు. మధుప్రాసన, గోదానం, యజ్ఞోపవీత ధారణ, కన్యావరుణులు, కన్యాదానం చేసిన పిదప, జీలకర్ర, బెల్లం అనంతరం మాంగళ్యధారణ చేశారు. తలంబ్రాలు, ఆరగింపు తరువాత మంగళాశాసనంతో కల్యాణోత్సవం ముగిసింది.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.43.31 లక్షలు

జగదాంబ కూడలి, మార్చి 21: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. భక్తులు గత 58 రోజుల్లో సమర్పించిన ఆదాయం రూ.43,31,258 రాగా, బంగారం 214.5 గ్రాములు, వెండి 796 గ్రాములు, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా, చాందా, సౌదీ, కొట్బార్, ఈజిప్ట సెంట్రల్ బ్యాంక్, టోరక్‌లి రాసికి చెందిన విదేశీ కరెన్సీ వచ్చినట్టు ఈవో పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అమ్మవారి దత్తత దేవాలయం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి హుండీల ద్వారా రూ2,25,484 ఆదాయం లభించిందన్నారు. హుండీ లెక్కింపులో దేవదాయశాఖ అధికారులు డీవీవీ సురేశ్ బాబు, కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ టి.ప్రశాంత్, శ్రీహరి సేవా సంఘం సభ్యులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

డీఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 21: తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న నాల్గవ డీఆర్ఎం కప్ అఖిల భారత పురుషుల, మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. టోర్నీలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 12 జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. దేశంలో క్రీడలకు విశేష ప్రాధాన్యత ఉందని, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించాలని పేర్కొన్నారు. టోర్నీలో లోపాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతోపాటు వాలీబాల్ సీనియర్ కోచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా తొలిరోజు మహిళల మ్యాచ్‌లో కిట్స్ యూనివర్సిటీ ఒడిశా 2-0 స్కోరుతో ఎస్‌బీపీ ట్రస్టు విజయవాడపై విజయం సాధించింది.

తెలుగుదేశం బీసీలకు పుట్టినిల్లు

▸ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

అక్కయ్యపాలెం, మార్చి 21: బీసీల పుట్టినిల్లు తెలుగు దేశం పార్టీయేనని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడానికి, ఓట్లు వేయడానికి బీసీలను వాడుకున్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు తెగబడ్డారని మండిపడ్డారు. 300 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారని, 25 వేల మందిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్ నుంచి రూ.75 వేల కోట్ల నిధులను దారి మళ్లించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా కొనసాగుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి, 16,800 రాజ్యాంగబద్ధ పదవులను బీసీలకు దక్కకుండా చేశారన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కేసబోయిన రామకృష్ణ, 44వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకరనాయుడు, వార్డు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

జగనన్న... పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో జీఏఎస్‌పీ సంస్థ ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరుకు భాగస్వామ్యులను ఎంపిక చేసుకోవడం, ప్లాస్టిక్ ఏరివేత, పునర్వినియోగంపై వినూత్న ఆలోచనలను రూపొందించడం, దీనికోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సమకూర్చే మార్గాలను గుర్తించడం, గ్రీన్ క్లైమేట్ ఛేంజ్ కోసం సలహాలు, సూచనలు ఇస్తుందని, 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వాటిని ఇతర ఉత్పత్తుల తయారీకి అవసరమయ్యే ముడిసరకు (యార్న్)గా మార్చి..ప్రపంచంలో పేరొందిన అడిడాస్, మెర్సిడెజ్ బెంజ్, లూయిస్ విట్టన్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీలకు సరఫరా చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖ బీచ్ స్వరూపమే మారిపోతుందని, ప్లాస్టిక్ పునర్వినియోగంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని గొప్పలు చెప్పారు. అయితే ఒప్పందం జరిగి ఏడాదిన్నర అయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఒప్పంద పత్రాలు మార్చుకోవడంతోనే ప్రాజెక్టు కథ ముగిసిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం కోసం సీఎం నగరానికి వస్తున్నారంటూ నగర సుందరీకరణ పేరుతో జీవీఎంసీ అధికారులు రూ.లక్షలు వెచ్చించారు. కార్యక్రమ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లుతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇంతవరకూ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం చర్చ కూడా లేకపోవడం గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా అసలు ఆ ప్రాజెక్టు ఒకటి ఉందనే విషయం తమకు గుర్తులేదన్నట్టుగా మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పార్టీలకు అనుకూలంగా వ్యవహరించొద్దు

... 5వ పేజీ తరువాయి

బృందాలు నగరంలో తిరుగుతాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి సువిధ, సీ విజిల్ యాప్‌లతోపాటు డయల్ 100, డయల్ 112కి ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే నగర పరిధిలోని 635 మంది రౌడీషీటర్లు, 103 మంది డీసీలు, 40 మంది కేడీలు, 1,314 మంది సస్పెక్ట్ షీట్ కలిగివున్నవారితోపాటు సుమారు 3,200 మందిని బైండోవర్ చేశామన్నారు. నగరంలో 728 లైసెన్స్ గన్‌లు ఉండగా వాటన్నింటినీ స్టేషన్లలో డిపాజిట్ చేయించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించి, దానికి సంబంధించిన నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. తప్పుడు ఫిర్యాదులతో పోలీసుల శ్రమ, సమయం, ప్రజాధనం దుర్వినియోగం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ పోలీసులు మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది విధిగా తమ గుర్తింపు కార్డుతోపాటు ఎన్నికల డ్యూటీ పాస్‌ను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశాలు జారీచేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు మణికంఠ చందోలు, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయం ఆమె వెంటనే తన భర్తకు చెప్పేందుకు యత్నించగా అక్కడ ప్రచారం హోరులో ఆయన ఫోన్ తీయలేదు. దీంతో తైనాల కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతని ద్వారా విషయం తెలుసుకున్న తైనాల వెంటనే ఇంటికి చేరుకున్నారు. తైనాల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందిన వెంటనే డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్‌డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.


సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

తెలిసిన వారి పనేనని అనుమానం

తైనాల ఇంట్లో జరిగిన దోపిడీ తెలిసినవారి పనే అయివుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తైనాల ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఎస్.కోట వెళుతున్నారని, ఆ సమయంలో ఆయన భార్య మాత్రమే ఇంట్లో ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేసి ఇంకా రాలేదమని ప్రశ్నిస్తే, పనైపోయింది వచ్చేస్తానని...చెప్పాడని పోలీసులకు తైనాల భార్య తెలిపారు. దీంతో ఇద్దరు స్థానికులు దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తైనాల ఇంటి వద్ద సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న వైస్రాయ్ విల్లా అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఒకరు ద్విచక్ర వాహనంపై ఇంటి బయట వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు నిర్ధారించుకున్నారు. సీసీ కెమెరాలతోపాటు సెల్‌ఫోన్ టవర్ లోకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు


... 5వ పేజీ తరువాయి

సమావేశమయ్యారు. ఉద్యోగులు, సిబ్బంది వివరాలు నిర్ణీత కాలంలో అందజేయాలని, ఇప్పటికే ఇచ్చిన సమాచారంలో మార్పులు, చేర్పులు ఉంటే ముందుగా తెలియజేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు అందరూ సహకారం అందించా లన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, మానవ వనరుల విభాగం కేటాయింపుల నోడల్ అధికారి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు నియమావళి పట్టదా?

▸ ఆస్తిపన్ను చెల్లింపుపై రాయితీ ప్రకటనలో సీఎం, మేయర్ ఫొటో

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జీవీఎంసీలోని కొంత మంది అధికారులు పెడచెవిన పెడుతున్నారు. రాజకీయనేతల ఫొటోలతో ఎలాంటి ప్రచారం చేయకూడదని, ప్రభుత్వం తరఫున అందించే సేవల్లో కూడా వారి ఫొటోలు వాడొద్దని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశించింది. కానీ ఆస్తిపన్నుని ఈనెలాఖరులోగా చెల్లించేవారికి వడ్డీ మాఫీకి సంబంధించిన ప్రకటనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఫొటోలు పెట్టి యాడ్ తయారు చేయడమే కాకుండా వాటిని తమ సెల్‌ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.





పెందుర్తిలో తనిఖీలలో పాల్గొన్న సిబ్బంది

సెబ్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు

పెందుర్తి, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సరిపల్లి, అడివివరం, తదితరు ప్రాంతాల్లో స్థానిక సెబ్ స్టేషన్‌ల సీఐలతో పాటు సిబ్బందం వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయని సెబ్ సహాయక ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షణాధికారి సుబ్బారావు తెలిపారు. ఈ క్రమంలో విశాఖ సెబ్ స్టేషన్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో 50 కేసులు నమోదు చేసి వందల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

రూ.80 వేల నగదు స్వాధీనం

పెందుర్తి, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సరిపల్లిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.80 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. ఎస్.కోట నుంచి నగరంలోకి వెళుతున్న కారును తనిఖీ చేయగా ఈ నగదు లభ్యమైందన్నారు. అయితే కారులో ఉన్న వ్యక్తులు తమకు ఎస్.కోటలో స్పోర్ట్స్ షోరూమ్ ఉందని, ఇందుకు సంబంధించిన చెల్లింపుల కోసం ఈ నగదు పట్టుకువెళుతున్నట్టు ఆధారాలు చూపారన్నారు. అయితేఏ ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి రవాణా చేయరాదన్న క్రమంలో ఈ నగదును సీజ్ చేశామని సీఐ పేర్కొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, మార్చి 21: బాలికలు రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని ఆచరించి పరిశుభ్రమైన జీవన శైలిని పొందడంపై శ్రద్ధ చూపాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ జి.సుజాత అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థినులకు ఆరోగ్య సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుజాత విద్యార్థినులకు పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, మార్చి 21: సుజాతనగర్ సబ్ స్టేషన్ 11కేవీ వుడా కాలనీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీ డీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సుజాతనగర్ బీ-జోన్, సప్తగిరినగర్, హష్మీ నగర్, గ్యాస్ గొడౌన్, గణేశ్‌నగర్, బ్యాంకు కాలనీ, వుడా కాలనీ, రైలు విహార్, వీరానగర్, అంబేడ్కర్‌నగర్, చినముషిడివాడ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా తొలి ఘటాల ఉత్సవం

అగనంపూడి, మార్చి 21: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి తొలి ఘటాల మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇక్కడి పూజారి ఇంటి నుంచి ప్రత్యేక పూజలు చేశాక తొలి ఘటాల ఊరేగింపును ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి ఘటాలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఘటాలను పురవీధుల్లో భజనలు, చిడతలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. ఈ నెల 25న కోటి దీపాల జాతర, 26న అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 22, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళదుంపలు 21, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 36, బరబాటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 68, కీర దోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సత్తిబాబు.. పక్కన స్వాధీనం చేసుకున్న గంజాయి, సీజ్ చేసిన వాహనాలు

గంజాయి పట్టివేత కేసులో ఐదుగురి అరెస్టు

ఐదు వాహనాలు సీజ్
మరో ఆరుగురి కోసం గాలింపు
డీసీపీ-2 ఎం.సత్తిబాబు

గోపాలపట్నం, మార్చి 21: రెండు రోజుల క్రితం కొత్తపాలెంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయిని పట్టుకున్న కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కొత్తపాలెంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ-2 ఎం.సత్తిబాబు కేసు వివరాలను వెల్లడించారు. అనకాపల్లి చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన గాడి సంతోశ్ (32), నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన గుమ్మాల పైడిరాజు (40), ఎర్రా మౌళి (36), సీతమ్మధారకు చెందిన నారికేళం గణపతి (21), కొత్తపాలేనికి చెందిన రాపేటి నూకేశ్ (36)లు తమకు పరిచయస్తులైన పవన్, ఆనంద్, త్రినాథ్ అనే వ్యక్తులతో కలిసి విశాఖ ఏజెన్సీలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని కొత్తపాలెంలో నూకేశ్ బంధువు నిర్వహిస్తున్న టిఫిన్ షాపులో నిల్వ చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ షాపుపై దాడి చేసి సుమారు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. గంజాయి రవాణా చేస్తున్న సంతోశ్, పైడిరాజు, మౌళి, గణపతి, నూకేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఆరుగురి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి తరలించడానికి వినియోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును సీజ్ చేశామన్నారు. అదేవిధంగా గంజాయి నిల్వ చేసిన టిఫిన్ షాపును కూడా సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కొరియర్ సర్వీసులు, పార్శిల్ సర్వీసుల ద్వారా గంజాయి తరలిస్తున్నట్టు తమవద్ద సమాచారం ఉందని, వాటిపై కూడా దాడులు చేసి తగిన చర్యలు చేపడతామన్నారు. విలేకరుల సమావేశంలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, జనసేన నాయకులను కలిసిన 'పల్లా'

గాజువాక, మార్చి 21: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గురువారం బీజేపీ, జనసేన నాయకులు డాక్టర్ గొర్లె సత్యనారాయణ, తదితరులను కలిసి త్వరలో జరగనున్న ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గ పాలనకు సమాధి కట్టేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోమాడ వాసు, నల్లూరు సూర్యనారాయణ, త్రినాథ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

87వ వార్డులో..

కూర్మన్నపాలెం, మార్చి 21: గాజువాక నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గురువారం 87వ వార్డులోని జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో తన విజయానికి అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని సైకో పాలనకు స్వస్తి పలకాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సీఎం జగన్ నవ మోసాల గురించి ప్రజలకు విపులంగా వివరించాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును సీఎంను చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, జనసేన నాయకులు సిరసపల్లి కనకరాజు, భాస్కరరాజు, బీజేపీ నాయకుడు లక్కరాజు సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో 'పల్లా' పూజలు

జీవీఎంసీ 86జ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు శేషగిరిరావు ఆధ్వర్యంలో 'పల్లా'కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయానికి వచ్చిన భక్తులను ఆప్యాయంగా పలుకరించి, రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. జనసేన, బీజేపీ నాయకులు కాదా శ్రీను, బొండా శ్రీదేవి, ఎల్లాజీరావులను కలిసి తన విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన ఆర్ఆర్ వాకర్స్‌ను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయ భవనంపై ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్

విమానాశ్రయంలో రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు

గోపాలపట్నం, మార్చి 21: పర్యావరణ అనుకూల చొరవలో భాగంగా విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఏడాదికి సుమారు 54,000 కేడబ్ల్యూహెచ్ విద్యుత్ ఉత్పాదన చేసే విధంగా ఈ ప్లాంట్‌ను రూపొందించారు. ఏపీఎస్ఈబీకి గ్రీన్ పవర్ టారిఫ్ చెల్లించడం ద్వారా విమానాశ్రయం గ్రీన్ పవర్ చందాదారుగా చేరినట్టు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. గ్రీన్ ఎనర్జీని వినియోగించాలనే నిబద్ధతతో విమానాశ్రయంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ తెలిపారు.

యువత చేతిలో ఆయుధం ఓటు

గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం.శ్రీభరత్



సదస్సులో మాటాడుతున్న శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి 21: యువత తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు, టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన భారత పరిశ్రమల సమాఖ్య అనుబంధ విభాగం యంగ్ ఇండియన్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఓటు హక్కుపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. 18 ఏళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. యువత తమ బాధ్యతను గుర్తెరిగి తమ ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. వివిధ కారణాలు చూపి ఓటింగ్‌కు దూరంగా ఉండడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో, కేంద్రంలో చట్ట సభలు, వాటికి గల అధికారాలను వివరించారు. .యంగ్ ఇండియన్స్ ప్రతినిధి ఉప్పలపాటి రాణా మాట్లాడుతూ దేశంలో అధిక శాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువతకు ఓటు హక్కు కోసం అవగాహన కల్పించడానికే సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐఐ యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు సంజన, సుమీద్, నివేదిత, ఆదర్శ్, రోహిత్, గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, పాల్గొన్నారు.

గాజువాకలో ఎన్నికల కంట్రోల్ రూమ్



గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

గాజువాక, మార్చి 21: గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా, ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నా, ఓటర్లకు సంబంధించి సందేహాలు, మార్పులు, తదితర అంశాలకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 24 గంటల పాటు ఈ కంట్రోల్ రూమ్‌లోని కాల్ సెంటర్ పని చేస్తుందన్నారు. అందువల్ల ఎవరైనా సరే 0891-2760025, 8555085615 ఫోన్ చేయవచ్చని ఆయన తెలిపారు.

లక్ష్మీపురంలో త్రిశక్తి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ

కూర్మన్నపాలెం, మార్చి 21: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురంలో గురువారం దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వాసు, శ్రీధర్ స్వాముల పర్యవేక్షణలో పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి త్రిశక్తి అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎ.సూర్యనారాయణ, కె.రామరాజు, సిరసపల్లి బాబూరావు, బి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డులో ఏయూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి

వెంకోజీపాలెం, మార్చి 21: ఏయూ చెందిన పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులు నేవల్ డాక్ యార్డులో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పూర్తి చేశారు. గత నెల 14 నుంచి ఈనెల 16 వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు నేవల్ డాక్ ఇంటర్న్‌షిప్‌లో భాగస్వాములయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు వివిధ ఇంజనీరింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కమండోర్ సంజయ్‌కుమార్, జనరల్ మేనేజరు (హెచ్‌ఆర్) సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. భవిష్యత్తులో కూడా ఏయూ విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్‌షిప్ అందిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఆచార్య పి. మల్లికార్జునరావు, ఆచార్య కె. రాంజీ ఆచార్య ప్రసాద్, కోర్సు సమన్వయకర్త ఆచార్య గిరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, మార్చి 21: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని బాలాజీ దివ్యక్షేత్రంలో ఫాల్గుణ మాస గురువారాన్ని పురస్కరించుకుని చేపట్టిన తిరుప్పావడ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దివ్యక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పువ్వులు, నగలతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఎదుట సుమారు 30 కిలోల పులిహోరాను శ్రీవారి ఆకారంలో అమర్చి దానిపై పలు రకాల పండ్లు, పుష్పాలను పెట్టి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వేదపండితులు శ్రీనివాస గద్యాన్ని ఆలపిస్తూ భక్తులకు స్వామివారి నేత్ర దర్శనాన్ని కల్పించారు. వేదపండితులు సహస్ర నామార్చనతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు.

భూగర్భ జలాల పెంపుపై అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం, మార్చి 21: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో గురువారం భూగర్భ జలాలు పెంపుపై కాలనీవాసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇళ్ల వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలను విధిగా ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ నిషేధానికి క్లాత్ సంచులు, స్టీల్ బాక్సులను వాడాలని, పరిసర ప్రాంతాల్లో చెత్తా,చెదారాలు వేయరాదనీ, తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ పురవీధలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు అభిషేకాలు

వేపగుంట మార్చి 21: వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవం ముత్యాలమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. మాలధారణ చేసిన భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం సామూహిక భక్తి గీతాలను ఆలపించారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, మార్చి 21: ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథున్ని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం భజనతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకటరమణారెడ్డి, వ్యాసశర్మ, శంభుడు, రామారావు, సత్యలక్ష్మి, పంకజ, సూరీడమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఇక్కడి అంబేడ్కర్ నగర్‌లో పునర్నిర్మించిన షిర్డీ సాయి ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు, సేజ్ హారతి ఇచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలో పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

బీసీ రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ఇతర వాహనదారులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 21: స్టీల్‌ప్లాంట్ బీసీ రోడ్డు నుంచి బ్రిడ్జి వరకు భారీ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారికి ఇరువైపులా భారీ వానాలను పార్కింగ్ చేయడం వల్ల ఉక్కు ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడడమే కాకుండా రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారని కార్మిక నాయకుడు డీవీ రమణ అధికారులకు వివరించారు. గడిచిన మూడు రోజులుగా పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారిందన్నారు. భారీ వాహనాల డ్రైవర్లకు చెబుతున్నా వారు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని ఉక్కు అధికాలను కార్మికులు కోరారు.

అశోక్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

పెదగంట్యాడ, మార్చి 21: అశోక్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. కాలనీకి కుళాయిల ద్వారా రావలసిన నీరు లీకేజీల వల్ల డ్రైనేజీ పాలవ్వడంతో ఈ దుస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే పరిస్థితి ఇలాగుంటే ముందు ముందు ఎలాగుంటుందోనని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు 90 శాతం మంది ఇళ్లకు మునిసిపల్ కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. గిరిజాకాలనీలోని కొండవాలు ప్రాంతంలో ఉన్న ట్యాంక్ నుంచి పైపులైన్ల ద్వారా ఈ కుళాయిలకు నీటి సరఫరా జరుగుతుంది. మెయిన్ పైపులైన్‌లో నాలుగైదు చోట్ల లీకులు ఉన్నాయి. ట్యాంకు నుచి కుళాయిలకు నీరు పంపింగ్ చేసినప్పుడు లీకేజీల వల్ల నీరంతా రోడ్డుపైకి వచ్చేసి కాలువల్లో కలిసిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ లైన్‌కు దగ్గరలో ఉన్న కొన్ని కుళాయిల ద్వారా మాత్రమే కొద్దిపాటి నీరు వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. కాలనీలోని 60 శాతం కుళాయిల నుంచి నీరు రావడం లేదు. మునిసిపల్ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా, వార్డు ప్రజాప్రతినిధికి సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు గానీ సచివాలయ సిబ్బంది కానీ పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆందోళనలను దిగుతామని వారు పేర్కొంటున్నారు.

ఎన్నికల నిబంధనలను వలంటీర్లు పాటించాలి

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, మార్చి 21: వలంటీర్లందరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ఆర్‌పీలను అడ్డం పెట్టుకుని వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. వలంటీర్లు, ఆర్‌పీలకు రానున్న తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో గౌరవం ఇవ్వడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని, అందువల్ల ఎవరూ అందరూ నియమాలను పాటించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, రట్టి వాసు, శ్రీనివాసరావు, ఉమా, నర్సింగ్, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మూట్ కోర్టు పోటీల్లో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 21: మేఘాలయ నేషనల్ లా వర్సిటీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంయుక్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించిన జాతీయ మూట్ కోర్టు పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆ విద్యార్థులను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తమ విద్యార్థులు అథర్వ్ ఆర్జవ్, కౌశిక్‌శర్మ, అభ్యుదయ్ మిశ్రా బృందం ప్రాథమిక రౌండ్‌లోనే తమ ప్రతిభను కనబరిచి అత్యున్నత ర్యాంక్ పొందిన జట్టుగా నిలిచిందన్నారు. ఈ పోటీల్లో అథర్వ్ ఆర్జవ్ ఉత్తమ వక్తగా, కౌశిక్ రెండవ ఉత్తమ వక్తగా నిలిచారన్నారు. అభ్యుదయ్ మిశ్రా చేసిన పరిశోధనకు మొదటి బహుమతి లభించిందన్నారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు



ఎన్టీఆర్, ఇందిరాగాంధీ, వైఎస్ విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం

మల్కాపురం, మార్చి 21: ఎన్నికల దృష్ట్యా పారిశ్రామిక ప్రాంతంలోని రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. జీవీఎంసీ పాఠశాలలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లు కనిపించకుండా పేపర్లు అతికించారు. సచివాలయాలకు ఉన్న బోర్డులను కూడా మూసివేయించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే తగిన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

చేతి వృత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మల్కాపురం, మార్చి 21: మహిళలు చేతి వృత్తులకు ప్రాధాన్యమిస్తూ స్వయం ఉపాధిని సాధించాలని, హస్తకళలను అందరూ ప్రోత్రహించాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి ఎ.సంధ్యారాణి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో గురువారం ఇందిరాకాలనీ, బర్మా కాలనీల్లో ప్రత్యేక సేవా శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా ఏదో ఒక వృతి నైపుణ్యాన్ని అలవరుచుకోవాలన్నారు. అనంతరం కాగితాలతో పువ్వులు, బొకేలను తయారు చేయడంలో వలంటీర్లకు, స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు నదియా, వై.అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సత్యసాయినగర్, సింగాలమ్మపురం, బీఎస్ లేఅవుట్, వినాయక ఆలయం, గ్రీన్‌పార్కు ఏరియాల్లో సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

సమన్వయంతో కూటమి విజయానికి కృషిచేయాలి

» తెలుగుదేశం పార్టీ నాయకుడు శ్రీభరత్

మహారాణిపేట, మార్చి 21: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేయాలంటే కార్యకర్తల మధ్య సమన్వయం అవసరమని టీడీపీ నాయకుడు ఎం.శ్రీభరత్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఉత్తర నియోజవర్గంలోని పార్టీ వార్డు అధ్యక్షులు, బూత్ నాయకులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పొత్తులో భాగంగా మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై విస్తృత ప్రచారం అవసరమని, ఇంటింటికీ వెళ్లి వాటిని వివరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నేతలు బి.బాలకృష్ణ, ఎం.కిశోర్, వెంకట రమణారావు, అక్కిరెడ్డి జగదీష్, ఇ. రమణ తదితరులు పాల్గొన్నారు.


ధర్మానగర్‌లో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్ రాజు

కూటమితోనే సుస్థిర పాలన

కంచరపాలెం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. జీవీఎంసీ 55వ వార్డులోని ధర్మానగర్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, అన్ని రకాలుగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఆయన వెంటన విజయలక్ష్మి, పార్వతి ఇతర నాయకులు పాల్గొన్నారు.


'ఉత్తర' నేతలతో మాట్లాడుతున్న శ్రీభరత్

నగరంలో సెబ్ విస్తృత తనిఖీలు

సీతమ్మధార, మార్చి 21: ఎన్నికల నేపథ్యంలో రామాటాకీస్ జంక్షన్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం తరలింపు జరుగుతోందనే అనుమానంతో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజులు నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు వి.వేణుగోపాల్, ఎస్.ముసలనాయుడు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

'కేఏ పాల్ విజయాన్ని ఆపలేరు'

అక్కయ్యపాలెం, మార్చి 21: విశాఖ లోక్‌సభ సభ్యునిగా పోటీ చేయనున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్ అన్నారు. రైల్వేన్యూ కాలనీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి, నగరానికి విశేష గుర్తింపు రావాలంటే కేఏ పాల్‌తోనే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో బాబూజీరావు, రాజు, భవానీ, స్వాతి, సతీశ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జగదాంబ కూడలి, మార్చి 21: వన్‌టౌన్ కంచరవీధి ఎంబరుమన్నార్ దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచీ ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం గురుడవాహనంపై నిర్వహించిన శ్రీవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా సాగింది. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా విశేషహోమం, ప్రత్యేక అర్చన, బలిహరణ, విశేషపూజలను నిర్వహించారు. వేంకటేశ్వరునికి సదస్యం, స్థాళిపాకోత్సవం, సప్తమహర్షి ఆరాధన వంటి సేవలను నిర్వహించారు. ఈనెల 29 వరకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని ఈవో ఎం.నీలిమ తెలిపారు.


కోడూరుకు శోభన్‌బాబు స్మారక పురస్కారం


కనకరాజుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార, మార్చి 21 : నట భూషణ్ శోభన్‌బాబు 16వ వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌరగ్రంథాలయంలో శోభన్‌బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకార్ సేవా ట్రస్ట్ ఛైర్మన్, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు హాజరై కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. విజయ నిర్మాణ్ సంస్థ ఛైర్మన్ ఎస్.విజయ్‌కుమార్, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్, సంస్థ గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల నేపథ్యంలో డీఎస్సీని వాయిదా వేయాలి'

మహారాణిపేట, మార్చి 21: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు, పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సందర్భంగా డీఎస్సీ వాయిదా వేయాలని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం మహారాణిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోని డీఎస్సీని ఇప్పుడు హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధమయిందన్నారు. సుమారు పది లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం, పదోతరగతి స్పాట్ వాల్యూవషన్ ప్రక్రియ నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

జనసేనలో తారాస్థాయికి చేరుకున్న విభేదాలు

» ఏడుగురిపై కేసు నమోదు » 15 రోజుల రిమాండ్

పూర్ణామార్కెట్, మార్చి 21: దక్షిణ నియోజకవర్గంలోని జనసేన పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుపై కార్పొరేటర్ సాదిక్, వంశీ వర్గీయుల మధ్య రెండు రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో ఒకరిపై ఒకరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గరికిన రవి, శ్రావణ్, త్రినాథ్, రఘు, నీలంరాజు, వాసుపల్లి నరేష్, చిన్నాలపై నమోదు చేసి, కోర్టులో హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించిందని వన్‌టౌన్ సీఐ కె.భాస్కర్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

డాబాగార్డెన్స్, మార్చి 21: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అడవుల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ మంజుల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న మహిళా కళాశాల అధ్యాపకులు

అంగరంగ వైభవంగా అనంత పద్మనాభుని కల్యాణం


స్వామివారి తిరువీధి, ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పద్మనాభం, మార్చి 21: అనంత పద్మనాభుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి భక్త జన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు పండితుల వేదమంత్రోచ్చారణలతో పద్మనాభం పులకించింది. భక్తుల కోలాహలం మధ్య వైకుంఠ వాసుని కల్యాణం కమనీయంగా సాగింది. ఉత్సవానికి ముందు కుంతీమాధవస్వామి ఆలయంలో విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్ని ప్రతిష్ఠాపన, విశేషహోమాలు, గ్రామ బలిహరణ నిర్వహించారు. భేరి పూజ తరువాత గరుడ ధ్వజాన్ని ఆరోహణ చేశారు. హనుమంతుని వాహనంపైన అనంతుని ఉత్సవ విగ్రహాన్ని, పల్లకిపై శ్రీదేవి, భూదేవి సహిత స్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రాజవీధిలోని పాత ఆంధ్రాబ్యాంకు సమీపంలో ఎదురు సన్నాహోత్సవాలలో భాగంగా పెళ్లి చూపులను, వరునికి, వధువును అడిగే విధానాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుని ఉత్సవ విగ్రహాలను ఆలయంలోకి తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో ఉంచారు. దంపతులతో సంకల్పం చెప్పించిన అనంతరం ఈఓ నానాజీబాబు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పుణ్యాహవచనం, రక్షాబంధనం చేసి స్వామివారికి పాదప్రక్షాళన చేశారు. మధుప్రాసన, గోదానం, యజ్ఞోపవీత ధారణ, కన్యావరుణులు, కన్యాదానం చేసిన పిదప, జీలకర్ర, బెల్లం అనంతరం మాంగళ్యధారణ చేశారు. తలంబ్రాలు, ఆరగింపు తరువాత మంగళాశాసనంతో కల్యాణోత్సవం ముగిసింది.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.43.31 లక్షలు

జగదాంబ కూడలి, మార్చి 21: వన్‌టౌన్ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. భక్తులు గత 58 రోజుల్లో సమర్పించిన ఆదాయం రూ.43,31,258 రాగా, బంగారం 214.5 గ్రాములు, వెండి 796 గ్రాములు, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, సింగపూర్, చైనా, చాందా, సౌదీ, కొట్టార్, ఈజిప్ట సెంట్రల్ బ్యాంక్, టొరకలి రాసికి చెందిన విదేశీ కరెన్సీ వచ్చినట్టు ఈవో పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అమ్మవారి దత్తత దేవాలయం శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి హుండీల ద్వారా రూ2,25,484 ఆదాయం లభించిందన్నారు. హుండీ లెక్కింపులో దేవదాయశాఖ అధికారులు డీవీవీ సురేశ్ బాబు, కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ టిప్రశాంత్, శ్రీహరి సేవా సంఘం సభ్యులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 21: తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న నాల్గవ డీఆర్‌ఎం కప్ అఖిల భారత పురుషుల, మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. టోర్నీలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 12 జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. దేశంలో క్రీడలకు విశేష ప్రాధాన్యత ఉందని, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో ప్రతిభను ప్రదర్శించాలని పేర్కొన్నారు. టోర్నీలో లోపాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతోపాటు వాలీబాల్ సీనియర్ కోచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా తొలిరోజు మహిళల మ్యాచ్‌లో కిట్స్ యూనివర్సిటీ ఒడిశా 2-0 స్కోరుతో ఎస్‌బీపీ ట్రస్టు విజయవాడపై విజయం సాధించింది.

తెలుగుదేశం బీసీలకు పుట్టినిల్లు

» పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

అక్కయ్యపాలెం, మార్చి 21: బీసీల పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడానికి, ఓట్లు వేయడానికి బీసీలను వాడుకున్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు తెగబడ్డారని మండిపడ్డారు. 300 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారని, 25 వేల మందిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్ నుంచి రూ.75 వేల కోట్ల నిధులను దారి మళ్లించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా కొనసాగుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి, 16,800 రాజ్యాంగబద్ధ పదవులను బీసీలకు దక్కకుండా చేశారన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కేసబోయిన రామకృష్ణ, 44వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకరనాయుడు, వార్డు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

జగనన్న... పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో జీఏఎస్‌పీ సంస్థ ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరుకు భాగస్వామ్యులను ఎంపిక చేసుకోవడం, ప్లాస్టిక్ ఏరివేత, పునర్వినియోగంపై వినూత్న ఆలోచనలను రూపొందించడం, దీనికోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సమకూర్చే మార్గాలను గుర్తించడం, గ్రీన్ క్లైమేట్ ఛేంజ్ కోసం సలహాలు, సూచనలు ఇస్తుందని, 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వాటిని ఇతర ఉత్పత్తుల తయారీకి అవసరమయ్యే ముడిసరకు (యాన్)గా మార్చి...ప్రపంచంలో పేరొందిన అడిడాస్, మెర్సిడెజ్ బెంజ్, లూయిస్ విట్టన్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీలకు సరఫరా చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖ బీచ్ స్వరూపమే మారిపోతుందని, ప్లాస్టిక్ పునర్వినియోగంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని గొప్పలు చెప్పారు. అయితే ఒప్పందం జరిగి ఏడాదిన్నర అయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఒప్పంద పత్రాలు మార్చుకోవడంతోనే ప్రాజెక్టు కథ ముగిసిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం కోసం సీఎం నగరానికి వస్తున్నారంటూ నగర సుందరీకరణ పేరుతో జీవీఎంసీ అధికారులు రూ.లక్షలు వెచ్చించారు. కార్యక్రమ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లుతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇంతవరకూ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం చర్చ కూడా లేకపోవడం గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా అసలు ఆ ప్రాజెక్టు ఒకటి ఉందనే విషయం తమకు గుర్తులేదన్నట్టుగా మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

పార్టీలకు అనుకూలంగా వ్యవహరించొద్దు

... 5వ పేజీ తరువాయి

బృందాలు నగరంలో తిరుగుతాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి సువిధ, సీ విజిల్ యాప్‌లతోపాటు డయల్ 100, డయల్ 112కి ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే నగర పరిధిలోని 635 మంది రౌడీషీటర్లు, 103 మంది డీసీలు, 40 మంది కేడీలు, 1,314 మంది సస్పెక్ట్ షీట్ కలిగివున్నవారితోపాటు సుమారు 3,200 మందిని బైండోవర్ చేశామన్నారు. నగరంలో 728 లైసెన్స్ గన్‌లు ఉండగా వాటన్నింటినీ స్టేషన్లలో డిపాజిట్ చేయించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించి, దానికి సంబంధించిన నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. తప్పుడు ఫిర్యాదులతో పోలీసుల శ్రమ, సమయం, ప్రజాధనం దుర్వినియోగం చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ పోలీసులు మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది విధిగా తమ గుర్తింపు కార్డుతోపాటు ఎన్నికల డ్యూటీ పాస్‌ను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశాలు జారీచేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు మణికంఠ చందోలు, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

... 5వ పేజీ తరువాయి

అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయం ఆమె వెంటనే తన భర్తకు చెప్పేందుకు యత్నించగా అక్కడ ప్రచారం హోరులో ఆయన ఫోన్ తీయలేదు. దీంతో తైనాల కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతని ద్వారా విషయం తెలుసుకున్న తైనాల వెంటనే ఇంటికి చేరుకున్నారు. తైనాల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందిన వెంటనే డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్‌డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.


సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

తెలిసిన వారి పనేనని అనుమానం

తైనాల ఇంట్లో జరిగిన దోపిడీ తెలిసినవారి పనే అయివుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తైనాల ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఎస్.కోట వెళుతున్నారని, ఆ సమయంలో ఆయన భార్య మాత్రమే ఇంట్లో ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేసి ఇంకా రాలేదమని ప్రశ్నిస్తే, పనైపోయింది వచ్చేస్తానని...చెప్పాడని పోలీసులకు తైనాల భార్య తెలిపారు. దీంతో ఇద్దరు స్థానికులు దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తైనాల ఇంటి వద్ద సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న వైస్రాయ్ విల్లా అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఒకరు ద్విచక్ర వాహనంపై ఇంటి బయట వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు నిర్ధారించుకున్నారు. సీసీ కెమెరాలతోపాటు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు


... 5వ పేజీ తరువాయి

సమావేశమయ్యారు. ఉద్యోగులు, సిబ్బంది వివరాలు నిర్ణీత కాలంలో అందజేయాలని, ఇప్పటికే ఇచ్చిన సమాచారంలో మార్పులు, చేర్పులు ఉంటే ముందుగా తెలియజేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు అందరూ సహకారం అందించా లన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, మానవ వనరుల విభాగం కేటాయింపుల నోడల్ అధికారి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగులకు నియమావళి పట్టదా?

» ఆస్తిపన్ను చెల్లింపుపై రాయితీ ప్రకటనలో సీఎం, మేయర్ ఫొటో

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జీవీఎంసీలోని కొంత మంది అధికారులు పెడచెవిన పెడుతున్నారు. రాజకీయనేతల ఫొటోలతో ఎలాంటి ప్రచారం చేయకూడదని, ప్రభుత్వం తరఫున అందించే సేవల్లో కూడా వారి ఫొటోలు వాడొద్దని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశించింది. కానీ ఆస్తిపన్నుని ఈనెలాఖరులోగా చెల్లించేవారికి వడ్డీ మాఫీకి సంబంధించిన ప్రకటనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఫొటోలు పెట్టి యాడ్ తయారు చేయడమే కాకుండా వాటిని తమ సెల్‌ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, మార్చి 21 : కాపులుప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పాత పరదేశిపాలెం లైన్ మరమ్మతు దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

మళ్లీ 'గడప గడపకు..' : వైవీ



విలేకరులతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

ఎండాడ, మార్చి 21 : నియోజకవర్గాల్లోని నాయకులంతా గడపగడపకు కార్యక్రమాన్ని మళ్లీ చేపట్టాలని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఆయన ఎండాడలో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థుల తరఫున ప్రచారాలు ఎలా నిర్వహించాలో సూచించారు. అన్ని నియోజవర్గాలకు అభ్యర్థులను ప్రకటించామని, విజయం కోసం సమష్టిగా పనిచేయాలని చెప్పారు. అనంతరం మే 13 వరకు పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

50 మంది రక్తదానం



కొమ్మాది, మార్చి 21 : పీఎంపాలెం రెండవ బస్టాప్ వద్ద గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది ఆర్‌హెచ్ కాలనీ, లక్ష్మీవానిపాలెం, బి2 కాలనీకి చెందిన 50 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. పోతిన ప్రసాదు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

రోడ్లపై చెత్త తొలగింపు

ఆరిలోవ, మార్చి 21 : ముడసర్లోవ నుంచి కేంద్ర కారాగారం వరకు ఉన్న సర్వీసు రోడ్డులో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోయి, ఎక్కడికక్కడ చెత్త నిల్వ ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఈ విషయమై పలుమార్లు పత్రికల్లో కథనాలు రావడం, స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు స్పందించారు. రోడ్డులో ఉన్న తుప్పలను తొలగించి, చెత్త పూడ్చారు.

చినవాల్తేరు, పెదవాల్తేరులో కేంద్ర బలగాల కవాతు

పెదవాల్తేరు, మార్చి 21 : ఎన్నికల నేపథ్యంలో చినవాల్తేరు, పెదవాల్తేరులో కేంద్ర బలగాలు గురువారం కవాతు చేపట్టాయి.మూడో పట్టణ సీఐ పార్థసారధి, ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చినవాల్తేరు, పెదవాల్తేరు, ఈస్టుపాయింట్ కాలనీ, సీబీఐ జంక్షన్ ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు.

వెంకన్నకు పుష్ప యాగం

ఆరిలోవ, మార్చి 21 : చినగదిలిలోని రాధాకృష్ణనగర్‌లో కల్యాణ వెంకటేశ్వరస్వామికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పుష్పయాగం నిర్వహించారు.ముందుగా ఆలయ అర్చకుడు ఫణిహారం వెంకట పరసింహాచార్యులు స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23,టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 28, బీరకాయలు 30, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 22, బంగాళా దుంపలు 21, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 144, బరబటి 18, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 68, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 50, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

భీమునిపట్నం, మార్చి 21 : పట్టణంలోని నాలుగో వార్డు జేవీ అగ్రహారం, కె. నగరపాలెంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. నగరపాలెంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చెత్తతో నిండిపోయి మురుగు నీరు రహదారిపై పారుతుండడాన్ని గమనించారు. ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించే పారిశుధ్య విభాగాధికారులు ఇలాంటి విషయాలను నోట్ చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన డీపీఆర్‌ను రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం కోడ్ వున్నందున కొత్తగా ఏ పనులు చేపట్టకూడదని ఎన్నికలు ముగిసిన తర్వాత కాలువ పనులు చేస్తామని స్థానికులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్సీ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కె. నగరపాలెంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న విశ్వనాథన్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి : జడ్సీ

ఆరిలోవ, మార్చి 21 : ప్రజలు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని జోన్-2 జడ్సీ జి.శైలజా వల్లి అన్నారు. గురువారం గాంధీనగర్‌లోని ఎంపీపీ స్కూలు నుంచి తోటగరువు పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివిధ కారణాలు చూపి ఓటింగ్‌కు దూరంగా ఉండడం సరికాదన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జీవీఎంసీ సిబ్బంది

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, మార్చి 21 :వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ నామానికొక స్వర్ణ తులసీ దళంతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు. తరువాత అదే వేదికపై స్వామివారికి నిత్యకల్యాణం జరిపారు.

ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్‌లో ఉచిత శిక్షణ

సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్దన్

ఆరిలోవ, మార్చి 21 : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ కె. హర్షవర్దన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈనెలాఖరు నుంచి ఎంసెట్, ఐఐటీ, నీట్ ప్రవేశాలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని, బాలురకు గుంటూరులోని అడవితక్కెళ్లపాడు పాఠశాలలోనూ,బాలికలకు కృష్ణా జిల్లా గుండమ్మ పాఠశాలలోనూ శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈమేరకు నీట్‌కు 20 మంది, ఎంసెట్‌కు 15 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. భోజన, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు,చిత్రలేఖనంలోనూ తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. తొలుత ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకులాల కోఆర్డినేటర్ సంభాన రూపవతి, ప్రిన్సిపాళ్లు నాగేశ్వరి, జి. గ్రేసీ, ప్రియదర్శిని, రమేష్ పాల్గొన్నారు.కాగా క్రీడల్లో ప్రతిభ చూపిన పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించారు. పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఆల్‌ఇండియా చిల్డ్రన్స్ యూత్ ఆర్ట్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్టు ఆయన చెప్పారు.



పాఠశాల ఆవరణలో మొక్క నాడుతున్న హర్షవర్ధన్

'ధరిత్రి గంట' జయప్రదం చేయండి

వెంకోజీపాలెం, మార్చి 21 : నగరంలో ఈనెల 23న రాత్రి 8.30 నుంచి 9.30 వరకు విద్యుత్ ఉపకరణాలు ఆపి ధరిత్రి గంట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ప్రోగ్రాం అధికారి హనీ సెలజ్ కోరారు. గురువారం ఆమె ఏయూ సోషల్ వర్క్ విభాగంలో గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో ధరిత్రి గంట కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగోళాన్ని పరిరక్షించేందుకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రపంచవ్యాప్తంగా చాలా నగరాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని చెప్పారు. ఎవరికి వారు ఇళ్లల్లో స్వచ్ఛందంగా విద్యుత్ ఉపకరణాలను ఆపివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఏయూ అధికారులు పాల్గొన్నారు.

మడ అడవులతో తీరానికి రక్షణ

ఆరిలోవ, మార్చి 21 : ప్రకృతి వైపరీత్యాల నుంచి తీర ప్రాంతాన్ని మడ అడవులు సంరక్షిస్తాయని జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ నందని సలారీయా తెలిపారు. గురువారం జూపార్కులో జరిగిన అంతర్జాతీయ అటవీ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. తీర ప్రాంత రక్షణలో మడ అడవుల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, కోస్టల్ ఎకోసిస్టమ్ సభ్యులు ఈస్టరన్ ఘాట్స్ బయోమెట్రిక్ ఆధ్వర్యంలో పలు నమూనాలను ప్రదర్శించారు.

రూ.80 వేల నగదు స్వాధీనం

పెందుర్తి, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సరిపల్లిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద గురువారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.80 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. ఎస్.కోట నుంచి నగరంలోకి వెళుతున్న కారును తనిఖీ చేయగా ఈ నగదు లభ్యమైందన్నారు. అయితే కారులో ఉన్న వ్యక్తులు తమకు ఎస్.కోటలో స్పోర్ట్స్ షోరూమ్ ఉందని, ఇందుకు సంబంధించిన చెల్లింపుల కోసం ఈ నగదు పట్టుకువెళుతున్నట్టు ఆధారాలు చూపారన్నారు. అయితేఏ ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి రవాణా చేయరాదన్న క్రమంలో ఈ నగదును సీజ్ చేశామని సీఐ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత కేసులో ఐదుగురి అరెస్టు

» ఐదు వాహనాలు సీజ్ » డీసీపీ-2 సత్తిబాబు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ-2 ఎం.సత్తిబాబు

గోపాలపట్నం, మార్చి 21 : రెండు రోజుల క్రితం కొత్తపాలెంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయిని పట్టుకున్న కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు కొత్తపాలెంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ-2 ఎం. సత్తిబాబు కేసు వివరాలను వెల్లడించారు. అనకాపల్లి చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన గాడి సంతోశ్ (32), నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన గుమ్మాల పైడిరాజు (40), ఎర్రా మౌళి ((36), సీతమ్మధారకు చెందిన నారికేశం గణపతి (21), కొత్తపాలేనికి చెందిన రాపేటి నూకేశ్ (36)లు తమకు పరిచయస్తులైన పవన్, ఆనంద్, త్రినాథ్ అనే వ్యక్తులతో కలిసి విశాఖ ఏజెన్సీలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని కొత్తపాలెంలో నూకేశ్ బంధువు నిర్వహిస్తున్న టిఫిన్ షాపులో నిల్వ చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ షాపుపై దాడి చేసి సుమారు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. గంజాయి రవాణా చేస్తున్న సంతోశ్, పైడిరాజు, మౌళి, గణపతి, నూకేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఆరుగురి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు డీసీపీ తెలి పారు. గంజాయి తరలించడానికి వినియోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును సీజ్ చేశామన్నారు. అదేవిధంగా గంజాయి నిల్వ చేసిన టిఫిన్ షాపును కూడా సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.కొరియర్ సర్వీసులు, పార్శిల్ సర్వీసుల ద్వారా గంజాయి తరలిస్తున్నట్టు తమవద్ద సమాచారం ఉందని, వాటిపై కూడా దాడులు చేసి తగిన చర్యలు చేపడతామన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎం.శ్రీభరత్

యువత చేతిలో ఆయుధం ఓటు : శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి 21 : యువత తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని గీతం విద్యా సంస్థల చైర్మన్, టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన భారత పరిశ్రమల సమాఖ్య అనుబంధ విభాగం యంగ్ ఇండియన్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఓటు హక్కుపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. 18 ఏళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. యువత తమ బాధ్యతను గుర్తెరిగి తమ ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. వివిధ కారణాలు చూపి ఓటింగ్‌కు దూరంగా ఉండడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో, కేంద్రంలో చట్ట సభలు, వాటికి గల అధికారాలను వివరించారు. .యంగ్ ఇండియన్స్ ప్రతినిధి ఉప్పలపాటి రాణా మాట్లాడుతూ దేశంలో అధిక శాతం మంది ఓటింగ్‌కు దూరంగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువతకు ఓటు హక్కు కోసం అవగాహన కల్పించడానికే సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఐ యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు సంజన, సుమీద్, నివేదిత, ఆదర్శ్, రోహిత్, గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల వార్షిక తిరుకల్యాణం



సింహాచలం, మార్చి 21 : సింహగిరిపై గంగధార సమీపాన కొలువుదీరిన సీతారామస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాస శుక్లపక్ష దశమినాడు అంకురార్పణతో శ్రీకారం చుట్టి పూర్ణిమనాడు శ్రీ పుష్పయాగంతో ముగిస్తారు. ఈమేరకు బుధవారం సీతారాముల కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. భువిలో జరుగుతున్న సీతారాముల కల్యాణానికి దివిలో దేవతలకు ధర్వజారోహణ ద్వారా ఆహ్వానం పలికారు. గురువారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పుష్ప వేదికపై ఉత్సవమూర్తులు సీతారామలక్ష్మణ, హనుమానులను అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆడపెళ్లివారుగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్య ధారణలను వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల నడుమ జరిపి అక్షితారోపణం (తలంబ్రాలు)ను వేడుకగా జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, కల్యాణ తలంబ్రాలను అందజేశారు.

ఏయూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి

వెంకోజీపాలెం, మార్చి 21 : ఏయూ చెందిన పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులు నేవల్ డాక్ యార్డులో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పూర్తి చేశారు. గత నెల 14 నుంచి ఈనెల 16 వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు నేవల్ డాక్ ఇంటర్న్‌షిప్‌లో భాగస్వాములయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు వివిధ ఇంజనీరింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కమండోర్ సంజయ్‌కుమార్, జనరల్ మేనేజరు (హెచ్‌ఆర్) సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. భవిష్యత్తులో కూడా ఏయూ విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్‌షిప్ అందిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఆచార్య పి. మల్లికార్జునరావు, ఆచార్య కె. రాంజీ ఆచార్య ప్రసాద్, కోర్సు సమన్వయకర్త ఆచార్య గిరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో యథావిధిగా శిలాఫలాకాలు

ఎండాడ, మార్చి 21 : ఎన్నికల కోడ్ వచ్చి నాలుగు రోజులు అవుతున్నా.. జీవీఎంసీ అధికారులు నిబంధనలను అమలు చేయడంలో విఫలమవుతున్నారు. వార్డుల్లో ఎక్కడికక్కడ శిలాఫలకాలపై మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లు కనిపిస్తున్నా.. వాటికి ముసుగు వేయడం లేదు. 8వ వార్డులోని వైఎల్‌పీ లేఅవుట్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులను అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రారంభించారు. ఈమేరకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాటిపై ముసుగు వేయాల్సిన సచివాలయ సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలానే 9వ వార్డులోని సీతకొండ వ్యూపాయింట్ ప్రాంతంలో ఉన్న శిలాఫలకంపై వైసీపీ రంగులతో మంత్రుల పేర్లు కనిపిస్తున్నా..వాటిపై కూడా ముసుగు వేయలేదు. వీటిని చూసిన స్థానికులు అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి ఒకలా.. ప్రతిపక్ష పార్టీలకు మరోలా చర్యలు తీసుకోవడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు.



గొల్లల ఎండాడ వైఎల్‌పీ లేఅవుట్‌లో మంత్రుల పేరుతో ఉన్న శిలాఫలకం



సీతకొండ వ్యూపాయింట్ ప్రాంతంలో శిలాఫలకంపై వైసీపీ రంగులతో ఉన్న మంత్రుల పేర్లు



శ్రీలక్ష్మీనారాయణ వ్రతములో పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో శ్రీలక్ష్మీనారాయణ వ్రతం

భీమునిపట్నం, మార్చి 21 : పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీలక్ష్మీ నారాయణ వ్రతము నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు తరువాత విశేష హోమములు అనంతరం సామూహిక శ్రీలక్ష్మీ నారాయణ వ్రతం చేపట్టారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నగర వీధుల్లో ఊరేగించారు. అనంతరం గోస్తనీ సాగర సంగమ ప్రదేశం ఉప్పుటేరులో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు జీవీ అప్పలాచార్యులు, ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు ఆదిమూలం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ధనాలకోటి చంద్రమూర్తి, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందరావు, సభ్యులు ముత్యాలరావు, హరి, సన్నిబాబు, సన్యాసిరావు, ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

సాంకేతిక యువజనోత్సవం ప్రారంభం

సాగర్‌నగర్, మార్చి 21 :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం (ఈఈసీ), ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఈటీఈ) సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం (ఐస్క్వేర్ ఆర్-2024) గురువారం నుంచి గీతంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త వివేక్ శర్మ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సమకాలీన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తాము రూపొందించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్ర ప్రసాద్, ఈఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి. భరణి చంద్ర కుమార్, ఐస్క్వేర్ ఆర్ కన్వీనర్ సెవెన్త్ లైన్, ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ పి. రాజు, విజయకుమార్, డాక్టర్ ఎస్. శారదా రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న మాణిక్యంనాయుడు

భీమునిపట్నం, మార్చి 21 : మదిలో భావాలకు అక్షర రూపం, మనసులో భావాలకు కళాత్మక రూపమే కవిత అని డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ యు. మాణిక్యంనాయుడు అన్నారు. గురువారం కళాశాలలో జరిగిన ప్రపంచ కవితా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాధలోనూ, సంతోషంలోనూ, విరహంలోనూ, కోపంలోనూ పైకి చెప్పుకోలేని అనేక భావాలు మనసులో మెదులుతుంటాయని, వాటికి అక్షర రూపం కల్పిస్తే చక్కటి కవితగా మారుతుందన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు వివిధ శీర్షికలతో పలు కవితలను వినిపించారు. కవితా పఠనంలో పాల్గొన్న వారికి అధ్యాపకులు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సీనియరు లెక్చరర్లు సుధాకర్, నాగేశ్వరరావు, సారిపల్లి త్రినాథరావు, జె. మాధవి, హరిణి, గొట్టేటి రవి పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న వైద్యురాలు సంహిత

ఆనందపురం, మార్చి 21 : మండలంలోని గిడిజాల గ్రామంలో విశ్వనాథ ఫార్మా సూటికల్ సైన్సెస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గర్భాశయ కేన్సర్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సంహిత మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్ రాకుండా మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికి వెళ్లి రక్తపోటు, డయాబెటీస్, రక్తహీనత, అంటు రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఎన్ఎస్ఎస్ పీవో టి. సమన్వయి, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

పద్మనాభం (రూరల్), మార్చి 21 : మండలంలో అనంతవరం, పెంట గ్రామాల్లో భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు, అనంతవరంలో ప్రధాన వీధిలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల హామీ కరపత్రాలను అందజేశారు. అలాగే పెంట గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రిపాటి పెదఎర్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్

గోపాలపట్నం, మార్చి 21 : పర్యావరణ అనుకూల చొరవలో భాగంగా విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఏడాదికి సుమారు 54,000 కేడబ్ల్యూహెచ్ విద్యుత్ ఉత్పాదన చేసే విధంగా ఈ ప్లాంట్‌ను రూపొందించారు. ఏపీఎస్ఈటీకి గ్రీన్ పవర్ టారిఫ్ చెల్లించడం ద్వారా విమానాశ్రయం గ్రీన్ పవర్ చందాదారుగా చేరినట్టు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. గ్రీన్ ఎనర్జీని వినియోగించాలనే నిబద్ధతతో విమానాశ్రయంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ తెలిపారు.

కోడ్ అమలులో అధికారుల వివక్ష

వెంకోజీపాలెం,మార్చి 21 : ఎన్నికల కోడ్ అమలులో అధికారులు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివక్ష చూపుతున్నారని టీడీపీ తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి ఆరోపించారు. గురువారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పార్టీ జెండాలు, నాయకుల ఫొటోలు, బ్యానర్లు, బోర్డులు బహిరంగంగా ఉండకూడదని చెబుతున్న ఎన్నికల అధికారులకు ఇక్కడి మాజీ ఆర్మీ ఇంటికి బహిరంగంగా తగిలించిన 'జగనే మా నమ్మకం' పేరుతో ఉన్న బోర్డు కనిపించ లేదా అని ప్రశ్నించారు. వైసీపీ తరఫున ప్రచారం చేసిన ఆమెను అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారని, కానీ ఆమె తన ఇంటి బయట ఏర్పాటు చేసిన బోర్డును మాత్రం ఎందుకు తొలగించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డును తొలగించాలని కోరారు.